మధురానగర్‌లో పీజేఆర్ జయంతిలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు, బస్తీ నాయకులు – ఖైరతాబాద్

ఖైరతాబాద్ బడా గణేశ్ చౌరస్తా వద్ద విగ్రహానికి నివాళులర్పించి కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నేత, జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్ రెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ నేతలు మహేశ్ యాదవ్, ప్రవీణ్ కుమార్, చంద్రశేఖర్, రాజ్‌కుమార్, సందీప్ రాజ్, గోపి తదితరులు... –ఖైరతాబాద్

# జన నేతకు ఘన నివాళి

## ఘనంగా మాజీ మంత్రి పీజేఆర్ జయంతి

నివాళులర్పిస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి

ఎర్రగడ్డ/ జూబ్లీహిల్స్, జనవరి 12: దివంగత మాజీ మంత్రి పీజేఆర్ జయంతిని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలు చోట్ల, ఇంకా బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం ఘనంగా నిర్వహించాయి. పీజేఆర్ విగ్రహాలు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోరబండ డివిజన్ మధురానగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బస్తీ అధ్యక్షుడు ఎం.ఆనంద్ కుమార్ పీజేఆర్ విగ్రహానికి పూలమాల వేసి స్థానికంగా స్వీట్లు, పండ్లు పంచి పెట్టారు. ఆనంద్ కుమార్‌తో పాటు సంక్షేమ సంఘం నేతలు సరళమ్మ, లావణ్యరెడ్డి, భారతి, యూనుస్, సలీమ్, శివకుమార్, తిరుపతయ్య, ప్రతాప్, కృష్ణారెడ్డి, యాదయ్య, దేవేందర్‌రెడ్డి, పవన్‌గౌడ్, హనీఫ్, ఓమర్, యూసుఫ్, లతీఫ్, షకీర్, నసీర్, సందీప్, అభిషేక్, రఫీక్, షరీఫ్‌అలీ, షబ్బీర్, రాంచందర్, ముజాహిద్, ఖాసీం పాల్గొన్నారు. ఎస్సార్నీనగర్‌లో డివిజన్ బీఆర్ఎస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బొట్టు శివ, శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్, వీరేష్, సంతోష్, నరసింహ, శంకర్, ముజామిల్, శ్రీధర్, పవన్ పీజేఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. యూసుఫ్‌గూడ డివిజన్‌లో భారీ ఎత్తున పీజేఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

## హిమాయత్‌నగర్ వై జంక్షన్‌లో పీజేఆర్‌కు నివాళి

హిమాయత్‌నగర్ వై జంక్షన్‌లో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

హిమాయత్‌నగర్, జనవరి12: హిమాయత్‌నగర్ వై జంక్షన్‌లో పీజేఆర్ చిత్రపటానికి ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, కేక్ కట్ చేసి పలు సేవా కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సయ్యద్ జావీద్, దిలీప్‌రాజ్‌రెడ్డి, ముజ్జులాల్, జ్ఞానేశ్వర్, కమల, సంధ్యారాణి, నరేష్, నీలం శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

కవి డాక్టర్ జయరాజును సన్మానిస్తున్న జస్టిస్ నర్సింహారెడ్డి, తదితరులు

## పేదలకు న్యాయ సాయం అందించాలి

సిటీబ్యూరో, జనవరి 12(నమస్తే తెలంగాణ): 'దేశం ముందు.. ఆ తర్వాతే నేను' అని చెప్పిన వివేకానందుని మాటలు యువత మననం చేసుకుంటూ ముందుకు సాగుతూ, పేదలకు న్యాయ సాయం అందించాలని పాట్నా హైకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి అన్నారు. స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా శుక్రవారం నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ కళాశాలలో ఏర్పాటు చేసిన జాతీయ యువజన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, శారీరక, మానసిక దృఢత్వాన్ని కలిగి ఉండి.. వివేకానందుని ఆశయాల సాధన కోసం యువత పనిచేయాలన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ప్రముఖ కవి, గాయకుడు డాక్టర్ బి.జయరాజ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు తన కుటుంబం, సమాజం పట్ల ప్రేమను కలిగి ఉండాలని అన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక, సంప్రదాయ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యా సంస్థల సొసైటీ ఉపాధ్యక్షుడు నరసింహారావు, కార్యదర్శి అన్నదానం సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రెటరీ శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## చదువుతో పాటు సంస్కారాన్ని కలిగి ఉండాలి

వివేకానంద టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 12: చదువుతో పాటు ప్రతి వ్యక్తి సంస్కారాన్ని కలిగి ఉండాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. జీవితంలో ఎంతటి సమస్యలు వచ్చినా వాటిని ధైర్యంతో ఎదుర్కొవాలని విద్యార్థులకు సూచించారు. స్వామి వివేకానంద జయంత్యుత్సవాలను పురస్కరించుకొని పద్మశాలిపురం శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్వామి వివేకానంద లాంటి మహనీయుడు చెప్పిన మాటల్ని అనుసరించాలన్నారు. ఆయన పుస్తకాలు చదివి విద్యార్థులు జ్ఞానం పెంచుకోవాలన్నారు. వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. మండల స్థాయిలో మొత్తం 26 పాఠశాలల్లో 2019 మంది విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న 26 పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బొల్ల శ్రీనివాస్, నాయకులు మసన వెంకటేష్, పి.సూర్యకిరణ్, గంజి వెంకటేష్, కె.యాదగిరి, గుల్ల నరేందర్, ఎల్లప్ప, రామకృష్ణ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

## ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

మణికొండ, జనవరి 12: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారాలు చూపించేందుకు తను నిరంతరం పాటుపడతానని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలోని ప్రజలు పడుతున్న ఇబ్బందులను, పందెం వాగు నాలా ద్వారా వస్తున్న తీవ్ర దుర్వాసన, వర్షాకాలం సమయంలో వరదలతో సతమతమవుతున్న విషయాన్ని గతంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దృష్టికి మణికొండ కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య తీసుకెళ్లడం జరిగింది. దీంతో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ఆయన పర్యటించారు. నాలా ఆధునీకరణ పనుల గురించి ప్రత్యేక్షంగా అధికారులతో కలిసి పంచవటి కాలనీ, ట్రైల్స్, ఎంప్లాయిస్ కాలనీ, పయనీర్ కాలనీ, స్పెక్ట్రమ్ విల్లాస్, నెక్నాంపూర్ వరకు పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలను అధికారులకు అందజేశారు. పంచవటి కాలనీ రోడ్ నం: 10 సంగీత్ కాంక్రీట్ అపార్ట్‌మెంట్ దగ్గర బుల్కాపూర్ నాలా నుంచి పందెం వాగు నాలా డ్రైవర్షన్ పాయింట్‌లో ఒక చెక్ డ్యామ్ నిర్మించి బుల్కాపూర్ నాలా నుంచి వస్తున్న మురుగు నీటిని షేక్‌పేట్ నాలాలోకి మళ్లించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. పందెం వాగుపై 9.5 కోట్లతో నిర్మితమవుతున్న బాక్స్ డ్రైన్ పనులు సాధ్యమైనంత తొందరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలన్నారు. ఇంజనీరింగ్ నిపుణులతో చర్చిం ట్రైల్స్ వెంచర్ దగ్గర నుంచి శ్రీనివాస కాలనీ, ఎంప్లాయిస్ కాలనీ, సెక్రటేరియట్ కాలనీ, స్పెక్ట్రమ్ విల్లాస్, పయనీర్ ఎస్టేట్ మీదుగా నెక్నాంపూర్ చెరువు వరకు ఎక్కడెక్కడ బాక్స్ డ్రైన్ నిర్మాణానికి అనువుగా ఉంటుందో అక్కడ వీలైనంత తొందరగా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు, కౌన్సిలర్లు కావ్య, శైలజ, లక్ష్మీనారాయణ, వసంతరావు, నవీన్, తాజ్‌ఖాన్, సిద్దప్ప, కిరణ్, పద్మారావు, మున్సిపల్ కమీషనర్ ఫల్గుణ కుమార్, మణికొండ కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య అధ్యక్షులు సీతారాం ధూళిపాళ, కార్యదర్శి ఆంజనేయులు, ఎస్ఎన్‌డిపి ఇంజనీరింగ్ అధికారులు, పలు కాలనీ సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సీవరేజ్ పనులు త్వరితగతిన పూర్తి చేయండి

కీర్తి అపార్ట్‌మెంట్స్ ప్రాంతంలో సీవరేజ్ పనుల్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ వనం సంగీత

వెంగళరావునగర్, జనవరి 12: ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సీవరేజ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సోమాజిగూడ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ అధికారుల్ని కోరారు. ఎల్లారెడ్డిగూడ సుభాష్ నగర్‌లోని కీర్తి అపార్ట్‌మెంట్స్ ప్రాంతంలో సీవరేజ్ పనుల్ని వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, సీవరేజ్ పనులు పూర్తి అయితే, ఈ ప్రాంతంలోని ప్రజల అవస్థలు తొలుగుతాయన్నారు. రోడ్ల పైకి మురుగు చేరకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెజ్లింగ్‌లో నేషనల్స్‌కు పల్లెపు సింధు

రెజ్లింగ్‌లో నేషనల్స్‌కు ఎంపికైన పల్లెపు సింధును అభినందిస్తున్న కోచ్‌లు

మణికొండ, జనవరి 12: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హిమాయత్ సాగర్‌కు చెందిన రెజ్లర్ పల్లెపు సింధు నేషనల్ పోటీలకు ఎంపికైంది. తమిళనాడులో జరిగిన 11వ సౌత్ ఇండియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ 2023-24లో పల్లెపు సింధు 72 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది. ఇంతకు ముందు రెండు సార్లు తెలంగాణ తరపున ఖేలో ఇండియాలో పాల్గొని స్కూల్ గేమ్స్‌లో సైతం పతకాలు సాధించింది. ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు మహారాష్ట్రలోని పూణెలో జరిగే నేషనల్ సీనియర్ సెలక్షన్స్‌కు ఆమె ఎంపిక య్యారు. ఈ సందర్భంగా తెలంగాణ కోచ్ కె.నర్సింగరావు, రాజ్ కుమార్, సునీల్‌ల వద్ద ఆమె కోచింగ్ తీసుకుంటుంది.

ఘనంగా అయప్ప పడి పూజ

జూకల్ గ్రామంలో స్థానిక స్వాములు అయప్పస్వామి మహా పడిపూజను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూజలో నాయకులు బుక్క వేణు గోపాల్, వేణురెడ్డిలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. – శంషాబాద్ రూరల్, జనవరి 12

# మేయర్ మహేందర్ గౌడ్‌పై అవిశ్వాసం!

రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్లు

## తీర్మాన పత్రాన్ని కలెక్టర్ శశాంకను కలిసి అందజేసిన కార్పొరేటర్లు

బండ్లగూడ, జనవరి 12: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్ గౌడ్‌పై 16 మంది కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బండ్లగూడ జాగీర్‌ను మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసి, మొత్తం 22 వార్డులుగా విభజించి ఎన్నికలను నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు అధిక సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు ఉండటంతో స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఆదేశాలతో బుర్ర మహేందర్ గౌడ్‌ను బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఎన్నుకున్నారు. దీంతో మూడేండ్లు బాగానే ఉన్న అనంతరం, వారి మధ్య మనస్పర్థలు రావడంతో గతంలోనే జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ గోడును వినతి పత్రం ద్వారా తెలిపారు. అప్పుడే వారు అవిశ్వాసం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేశారు. కానీ, అప్పుడున్న ప్రభుత్వం నాలుగేండ్ల వరకు అవిశ్వాసం పెట్టేందుకు లేదని జీవో తీసుకువచ్చారు. చేసేది లేకపోవడంతో మరో సంవత్సరం వేచి ఉండి మేయర్ పదవి కాలం నాలుగు సంవత్సరాలు పూర్తి కావస్తుండటంతో వారు శుక్రవారం అవిశ్వాస తీర్మానం చేసి జిల్లా కలెక్టర్ శశాంకను కలిసి తమ విజ్ఞప్తిని ఆమోదించాలని కోరారు. తీర్మానం చేసిన వారిలో కార్పొరేటర్లు డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, భూపాల్ గౌడ్, ముద్దం రాము, అస్లాంబిన్ అబ్దుల్లా, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, చంద్రశేఖర్, ప్రశాంత్ నాయక్, మాలతీ నాగరాజు, ఖాజా ఆసియా బేగం, లతాప్రేమ్ గౌడ్, సంతోషి రాజిరెడ్డి, షాపురం పుష్ప, అనితా వెంకటేష్, నిఖిల సంగారెడ్డి, నాగుల స్రవంతి నరేందర్‌లు ఉన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్‌గా లతాప్రేమ్ గౌడ్‌ను ఎన్నుకోనున్నట్లు వారు తెలిపారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రవీందర్ రెడ్డి తదితరులు

## క్యాలెండర్ దిన చర్యకు రూపం

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 12: సమయాన్ని ఎప్పట్టికప్పుడు తెలియజేసే క్యాలెంటర్ ఉద్యోగులకు అవసరమని రాజేంద్రనగర్ పీవీ నర్సింహరావు వెటర్నరీ విశ్వవిద్యాలయం ఉప కులపతి డా.రవీందర్ రెడ్డి అన్నారు. నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ షర్ఫోద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ డా.జ్ఞాన ప్రకాశ్ , డీన్ రఘునందన్, నాయకులు సుధర్శన్, మధుసూదన్, అంజనేయులు, నర్సింహ పాల్గొన్నారు.

## మనం సైతం చేయూత

ప్రమాదానికి గురై తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సినీ, టీవీ నటుడు డి.వీరభద్రయ్యకు 'మనం సైతం ఫౌండేషన్' అండగా నిలిచింది. పలు సినిమాలు. టీవీ సీరియళ్లలో నటించిన వీరభద్రయ్య ఇటీవల ప్రమాదానికి గురై ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని తమ వంతు సాయంగా రూ.25 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం ఫిలింనగర్‌లో ఆయన కుటుంబ సభ్యులకు అందించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాదంబరి కిరణ్ కుమార్ తెలిపారు. – బంజారాహిల్స్, జనవరి 12

## ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు

ఎర్రగడ్డ, జనవరి 12: సంక్రాంతిని పురస్కరించుకుని బోరబండ డివిజన్ స్వరాజ్‌నగర్ రాక్‌స్టాన్ హైస్కూల్లో విద్యార్థినులకు నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలుగా నిల్చిన వారికి శుక్రవారం బహుమతులను అందజేశారు. ఇందుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన బోరబండ బీఆర్ఎస్ మహిళాధ్యక్షురాలు దేవమణి గౌడ్ బహుమతులను అందజేసి విజేతలను అభినందించారు. పల్లె వాతావరణాన్ని తలపించే విధంగా ముగ్గుల పోటీని నిర్వహించటం, అధిక సంఖ్యలో పోటీలో పాల్గొనటం, ఈ ఘనత నిర్వాహకులకు దక్కుతుందని ఆమె పేర్కొన్నారు. కరస్పాండెంట్ ఎన్.విజయ కుమార్, హెచ్ఎం పాక్యవతి, బీఆర్ఎస్ నేతలు ఎం.ఆనంద్ కుమార్, రజ్వీ, యాదయ్య, నీలం పద్మ పాల్గొన్నారు.

## మాదిగ వధూవరుల కోసం వివాహ వేదిక

హిమాయత్‌నగర్, జనవరి 12: జీవితంలో మధురమైన ఘట్టం వివాహం. పేద, మధ్య తరగతి మాదిగ సామాజిక వర్గం యువత సౌలభ్యం కోసం వివాహ వేదిక ఏర్పాటు చేసినట్లు జాంబవతి మాదిగ వివాహ వేదిక వ్యవస్థాపకుడు జేవీ ప్రసాద్ తెలిపారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెళ్లి సంబంధాలు కుదుర్చుకోవాలంటే పేద మాదిగ యువత ఎంతో ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారు సులభమైన మార్గంలో భాగస్వామ్యంను ఎంచుకునేందుకు ఈ వేదిక ఎంతో దోహదపడుతున్నదన్నారు. విలువలు, ఆదర్శవంతమైన మాదిగ సమాజ నిర్మాణం కోసం ప్రతి జిల్లా కేంద్రంతో పాటు గ్రామ స్థాయిల్లో సైతం ఈ వేదికలను విస్తరింపజేస్తామని చెప్పారు. ఆసక్తి గల మాదిగ యువకులు సెల్ ఫోన్ నం: 8309088091ను సంప్రదించాలని కోరారు.

సోమాజిగూడ డివిజన్ ఎంఎస్ మక్తాలో 15 రోజులుగా చెత్త పేరుకుపోగా సిబ్బంది స్పందించకపోవడంతో కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని తొలగింపచేశారు. – ఖైరతాబాద్

# భక్తిశ్రద్ధలతో వెంకన్న గుట్ట కుడారై ఉత్సవాలు

కుడారై ఉత్సావల్లో స్వామి వారి పూజల్లో భక్తులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 12: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవపల్లి డివిజన్‌లోని శ్రీ వెంకన్న గుట్ట కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం ధనుర్మాసంలో భాగంగా కుడారై ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రీ భూనీలా సహిత సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి 108 గంగాళాలతో ప్రసాదం నివేదనను అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవ, ఇతర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే దేవాలయంలో ప్రత్యేక పూజా నిర్వహించేందుకు భక్తులు దేవాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలతో పాటు ఊరేగింపు, పల్లకి సేవ నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## విద్యార్థుల నైపుణ్యతను పెంచాలి

(సీఈఎమ్‌సీఏ) డైరెక్టర్ డా.బషీర్ అహ్మద్ శాస్త్రాచ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రొ.సీతారామారావు తదితరులు

బంజారాహిల్స్, జనవరి 12: కాలానికి అనుగుణంగా పరిశ్రమకు కావాల్సిన నైపుణ్యాలను పెంచుకోవడం కోసం విద్యార్థులను తీర్చిదిద్దుకునేందుకు సార్వత్రిక విశ్వవిద్యాలయాలు సైతం ప్రయత్నించాల్సిన అవసరం ఉందని ఢిల్లీలోని కామన్‌వెల్త్ ఎడ్యుకేషనల్ మీడియా సెంటర్ ఫర్ ఏసియా(సీఈఎమ్‌సీఏ) డైరెక్టర్ డా.బషీర్ అహ్మద్ శాస్త్రాచ్ అన్నారు. దూరవిద్య పితామహుడు ప్రొ.జి.రాంరెడ్డి 94వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. బషీర్ అహ్మద్ 'సార్వత్రిక విశ్వవిద్యాలయాలు – విద్య4.0' అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. గతంలో ఓపెన్ యూనివర్సిటీలు డిజిటల్ విధానాలకు దూరంగా ఉండేవని, ప్రస్తుతం టెక్నాలజీ వినియోగంతో పాటు బోధనా పద్ధతుల్లో మార్పులు రావడంతో వాటిని అందిపుచ్చుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో వీసీ ప్రొ. కే.సీతారామారావు, అకడమిక్ డైరెక్టర్ ప్రొ.ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొ. ఏవీఎన్ రెడ్డి, ప్రొ. జి.హరగోపాల్ పాల్గొన్నారు.

## బెటాలియన్లలో ఆధునిక సౌకర్యాలు

మంజీరా కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న అడిషనల్ డీజీ స్వాతి లక్రా

జూబ్లీహిల్స్, జనవరి 12: పోలీస్ బెటాలియన్‌లలో ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీఎస్ఎస్‌పీ) అడిషనల్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ ప్రథమ పటాలంలో కమాండెంట్ పి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఓపెన్ ఎయిర్ థియేటర్, మంజీరా కమ్యూనిటీ హాల్, బీటీసీ అడ్మిన్ బ్లాక్‌లను డీఐజీ సిద్ధిఖీతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీజీ స్వాతి లక్రా మాట్లాడుతూ పోలీసు శిక్షణ కేంద్రాలుగా ఉంటున్న బెటాలియన్‌లలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన చిన్నారులను, బ్యాండ్ టీమ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ హెచ్.సత్యనారాయణ, అడిషనల్ కమాండెంట్ నరేందర్ సింగ్ పాల్గొన్నారు.

## ఖైరతాబాద్‌లో ఉత్సవాలు..

ప్రసాదం పంపిణీ చేస్తున్న ఈవో లావణ్య

బంజారాహిల్స్, జనవరి 12: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పలు వైష్ణవ ఆలయాల్లో కుడారై ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో స్థానికులు పెద్ద ఎత్తున నిర్వహించారు. స్వామి వారికి వెండి గిన్నెల్లో పాయస నివేదన చేశారు. అనంతరం భక్తులకు వాటిని ప్రసాదంగా అందజేశారు. శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కుడారై ఉత్సవాల్లో ఆలయ ఈవో లావణ్యతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బంజారాహిల్స్ రోడ్ నం.14లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కుడారై ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు.